# చేతిలో చందమామ

## వసుంధర

> నీలంరంగు పట్టుపరికిణీ ఆకాశంలా ఉంటే దానిమీద నక్షత్రాల్లాంటి చుక్కలు. ఆకాశాన్నీ భూమినీ కలిపే రేఖలా జరీఅంచు. వర్షించడానికి సిద్ధంగా ఉన్న శ్రావణ మేఘంవంటి పయ్యెద. అమావాస్య చీకటివంటి నల్లని జాకెట్టు. ఆపైన పున్నమి చందమామలా వెలిగే చిన్నారి మోము.

ప్లాట్‌ఫారంమీద అమ్మ, నాన్నగారు, అమ్మమ్మ, ఇద్దరు తమ్ముళ్ళు ఉన్నారు. నేను వాళ్ళవంకే దిగులుగా చూస్తున్నాను. వాళ్ళు నాకు జాగ్రత్తలు చెబుతున్నారు. నేను వింటూ తల ఊపుతున్నానుకానీ ఏమీ తలలో కెక్కడంలేదు.

ట్రయిన్ కదిలింది.

అమ్మ జాగ్రత్తలు చెబుతోంది. నాన్నగారేవో చెబుతున్నారు.

తమ్ముళ్ళు చేతులూపుతున్నారు. అమ్మమ్మ మాట్లాడకుండా కళ్ళొత్తుకుంటోంది.

నా కళ్ళలో నీళ్ళు.

నాన్నగారు ట్రయిన్‌తోపాటు ముందుకు పరుగెడుతున్నారు.

ఏదో చెప్పాలని ఆయన తాపత్రయం. పరీక్షహాల్లో అడుగుపెట్టేముందు క్షణందాకా పుస్తకం వదలలేని విద్యార్థి తాపత్రయమది. లేకుంటే ఆయన చెప్పవలసినవన్నీ ఎప్పుడో అయిపోయాయి.

ట్రయిన్ వేగం పుంజుకుంది.

అయినవాళ్ళందరూ కనుమరుగయ్యారు.

నేను జేబురుమాలుతో కళ్ళు తుడుచుకున్నాను.

"ఏమిటీ ట్రయిన్ ఇదేనా ఒంటరిగా మొదటిసారెక్కడం?"

గంభీరమైన గొంతువిని పక్కకు తిరిగాను.

అతడి పేరు నరహరి. ట్రయిన్లో నేనెక్కే ముందతడు విండో సీటు దగ్గర కూర్చున్నాడు. నాన్నగారు ఓరగా పక్కకు మారి నాకు విండో సీటిచ్చాడు.

"అవును" అన్నాను.

"నీకెన్నేళ్ళు?"

"పద్దెనిమిది"

"ఆ వయసుకు నేను ట్రయిన్లో ఒక్కడ్నీ బొంబాయెళ్ళి వస్తూండేవాణ్ణి..." అన్నాడు నరహరి.

నేనేం మాట్లాడలేదు.

"ఎప్పుడూలేనిది ఈ ఒక్కసారే విశాఖకెక్కణ్ణీ ఎందుకు పంపుతున్నారు?"

"నేను బీయస్సీ ప్యాసయ్యాను. ఎమ్మెస్సీలో చేరడానికి వెడుతున్నాను" అన్నాను. నేనది చెప్పడానికి కారణముంది. అతడి బ్రీఫ్‌కేసుమీద కె.నరహరి బి.ఏ అని ఉంది. అతడు నన్ను చిన్నచూపు చూడబోతున్నాడని నాకర్థమైంది. అందుకే అతడికంటే నేను గొప్పవాడినన్న విషయం గ్రహిస్తాడని అలా చెప్పాను".

నరహరి నవ్వి "అబ్బా గ్రాడ్యుయేటువన్న మాట. మరిప్పుడు విశాఖపట్నంలో దిగి యూనివర్సిటీకెలా వెడతావు?" అన్నాడు.

"నన్ను రిసీవ్ చేసుకుందుకు మా పిన్ని కార్లో వస్తుంది" అన్నాను. కావాలనే కార్లో అన్నపదం ఒత్తిపలికాను.

"అలాగా ఒకవేళ రాకపోతే?" అన్నాడు నరహరి.

"ఆ భయం నాకు ఉంది ఎందుకు రాదూ తప్పకుండా వస్తుంది..." అన్నాను బింకంగా.

"ఒకవేళ రాకపోతే భయపడకు. మీ పిన్ని అడ్రసు చెప్పి నావేలుపట్టుకున్నావంటే నేనే నిన్ను వాళ్ళింటికి తీసుకుని వెడతాను." అన్నాడు నరహరి.

నరహరికి నేనంటే వేళాకోళంగా ఉందని అర్థమయింది. కానీ ఏమనాలో అర్థంకాలేదు. ఆ విషయమై ఆలోచిస్తుండగానే కిసుక్కున నవ్వు వినిపించింది. ఉలిక్కిపడి అటు చూసేసరికి కళ్ళు జిగేల్ మన్నాయి.

నీలం రంగు పట్టు పరికిణీ ఆకాశంలా ఉంటే దాని మీద నక్షత్రాల్లాంటి చుక్కలు ఆకాశాన్నీ భూమినీ కలిపే రేఖలా జరీ అంచు. వర్షించడానికి సిద్ధంగా ఉన్న శ్రావణమేఘం వంటి పయ్యెద. అమావాస్య చీకటి వంటి నల్లని జాకెట్టు. ఆ పైన పున్నమి చందమామలా వెలిగే చిన్నారి మోము.

ఆమె వయసు పదహారుండవచ్చు. రెండు మూడేళ్ళుగా ఆ వయసు పిల్లల్ని చూస్తూంటే నాలో ఏదో చంచలనం రేగుతోంది. ఆమె ట్రయినెప్పుడెక్కిందో తెలియదు. ఒంటరి ప్రయాణపు బెంగలో ఆమెను నేను గమనించలేదు.

మనిషి ఎంత బాగుందో!

ఆమె అందాన్ని గమనిస్తూ వాస్తవంలోనికి రావడానికి నాకు కాసేపు పట్టింది. ఆమె అందంగానే ఉంది కానీ వాస్తవం అందంగా లేదు.

వాస్తవంలో ఆమె నవ్వింది. నరహరి నన్ను వెటకారం చేస్తే ఆనందిస్తూ అతడివంక అభినందన పూర్వకంగా చూస్తూ నవ్వింది.

నా వయసు పద్దెనిమిది. బీయస్సీ ఫస్టుక్లాసులో ప్యాసయ్యాను. ఎమ్మెస్సీ చదవబోతున్నాను. నేను సినిమాహీరోలాంటి వాణ్ణి.

అప్పుడు నేను నరహరిని గమనించాను. అతడు నాకంటే ఎత్తరికాదు కానీ బలంగా ఉన్నాడు. నేను తెల్లటి తెలుపైతే అతడి రంగు నలుపుకు దగ్గర. అటుపైన అతడు ఆఫ్టరాల్ బియ్యే!

నేనూ అతడినవమానించి ఆ అమ్మాయి ముందు నా ఆధిక్యత నిరూపించుకోవాలనుకున్నాను. అందుకని "మీరేం చదువుకున్నారు?" అన్నాను.

"ఫస్టుక్లాసుతో ఆపేశాను...." అన్నాడతడు చలించకుండా.

"కనీసం బియ్యే అయినా అయుంటారనుకున్నాను " అన్నాను కనీసం అన్నపదానికి ప్రాముఖ్యత నిస్తూ.

"ఈ రోజుల్లో చదువుకోవడమంత దండుగపనిలేదని తెలుసుకుందుకు బియ్యే దాకా చదవాలా?" అన్నాడతడు నిరసనగా.

మళ్ళీ ఆమె కిసుక్కున నవ్వింది... నేను ఓరకంట ఆమెను గమనించాను. ఆమె ఓరకంట నరహరినే చూస్తోంది. ఆమె నవ్వులో అతడిపట్ల అభినందన ఉంది.

నా కావేశం వచ్చింది "అయితే మీ బ్రీఫ్‌కేసుమీద బి.ఏ అని ఉంది " అన్నాను.

"భలేవాడివే! నీ వంటి వాణ్ణి ఏ డిటెక్టివ్ గానో చేస్తే గొప్పగా ఉంటుంది. ఈ బ్రీఫ్‌కేసు నాదికాదు. నా స్నేహితుడి దగ్గర్నుండి ఎరువు తెచ్చుకున్నాను. కొంపదీసి నా పేరు నరహరి అనుకునేవు. మురారి... తెలిసిందా?" అన్నాడతడు.

ఆమె మళ్ళీ నవ్వింది.

అతడితో నేను మాట్లాడలేనని పించింది. కానీ నా చదువు... తెలివి తేటలు... ఇవన్నీ వృధాయేనా?

"అయితే మీరేం చేస్తున్నారు?" అన్నాను. బ్రీఫ్‌కేసు స్నేహితుడి దగ్గర్నుంచి ఎరువుతీసుకున్నాడంటే అతడి ఉద్యోగ మేమంత గొప్పదై ఉండదు.

"నువ్వు ఎమ్మెస్సీ ప్యాసైతే ఎక్కడ వుద్యోగంలో చేరినా ఆరంభంలో జీతం నెలకు పదిహేను వందలు మించదు. ప్రస్తుతం నేను నెలకు అయిదువేలు సంపాదిస్తున్నాను."

అప్రయత్నంగా నేనామెను గమనించాను. ఆమెకళ్ళలో అభినంద స్థానే ఆరాధన కనబడింది.

"నాకు చాలా ఉక్రోషంగా ఉంది అంత మంచి సంపాదన ఉన్నప్పుడు మీకోస్వంత బ్రీఫ్‌కేసుంటే బాగుండేది " అన్నాను. సాధారణంగా నేను మరీ యింత సూటిగా ఎవర్నీ ఏమీ అనలేను. కానీ ఆ అమ్మాయి ముందు నన్ను చిన్నబుచ్చుతున్నందుకు నరహరి... కాదు కాదు... మురారి మీద నాకు చాలా కోపంగా ఉంది.

మురారి నవ్వి "నా బ్రీఫ్ కేసు ఇంతకంటే

మంచిదీ ఖరీదైనదీనూ. అది నరహరి అన్నయ్య ఎరువు తీసుకున్నాడు. అందుకే నరహరి నాకిదిచ్చి గడుపుకోమన్నాడు...'' అన్నాడు.

మళ్ళీ ఆమె నవ్వింది.

అతడబద్ధాలు చెబుతున్నాడో నిజంజెబుతున్నాడో నాకు తెలియడంలేదు కానీ నన్ను ప్రతి విషయంలోనూ దెబ్బతీస్తున్నాడు.

నేనింక మాట్లాడలేదు.

అప్పుడతడు ఈనాటి చదువుల గురించీ, చదువుకున్న యువకుల గురించీ ఉపన్యసించాడు. అందులో నా మీద చాలా విసుర్లున్నాయి. అసహాయుడినై అన్నీ భరించాను నేను.



అతణ్ణి వదల్చుకోవడంకోసం నేను ఎయిర్ బ్యాగులోంచి ఓ పుస్తకం తీశాను. అది చందమామ కథల బైండు పుస్తకం. మా యింట్లో అందరికీ చందమామ కథలంటే చాలా యిష్టం. అందులోని కథలన్నీ జాగ్రత్తగా తీసి బైండు చేయించి ఉంచారు. పంతొమ్మిదొందల యాభై మంచీ ఉన్నాయి మాయింట్లో పుస్తకాలు.

అయితే అతడు నన్నింకా వదలదల్చుకోలేదు—

''ఏమిటి చదువుతున్నావ్...'' అంటూ నాచేతిలోని పుస్తకం తీసి— ''చందమామ కథలా?'' అన్నాడు.

''ఊఁ'' అన్నాను.

''అబ్బే—'' అంటూ పెదవి విరిచాడు మురారి ''చందమామ కథలు పిల్లల్నీ పెద్దల్నీ అలరిస్తాయన్నది నిజమే కానీ బీయస్సీ పాసైన కుర్రాడు ఎమ్మెస్సీ చదవడానికి ట్రయిన్లో వెడుతూ ఆ కథలే చదవాలనుకోవడం మాత్రం దారుణం. నీ వయసు కుర్రాళ్ళు దేశం గురించి ఆలోచించాలి. చుట్టూ ఉన్న సమాజాన్ని చూసి చలించాలి. అమ్మ పెడితే బువ్వతిని నాన్న డబ్బిస్తే చదువుకుని అప్లికేషన్ పెట్టి ఉద్యోగం తెచ్చుకోవాలనే మనస్తత్వానికి నీ చేతిలో చందమామ ఒక ఉదాహరణ!''

నా ఎదురుగా ఉన్న అమ్మాయి మౌనంగా తనలో తనే నవ్వుకుంటోంది. నేనది గమనించాను. అతడు బ్రీఫ్ కేసు తనది కాదన్నాడు. అలాగే నేనూ అబద్ధం చెప్పి నా మర్యాద కాపాడుకోవాలనుకున్నాను.

''ఇది ఎయిర్ బ్యాగులో మా అమ్మమ్మ పెట్టినట్లుంది. ఆర్థర్ హెయిలీ ఎయిర్‌పోర్టనుకుని తీస్తే చేతికిది వచ్చింది '' అన్నాను. నేనసలు ఇంగ్లీషు నవలలు చదవను. ఎయిర్ పోర్ట్ సినిమా చూశాను. ఆర్థర్ హెయిలీ పేరు

నాకు తెలుసు. ఆ నవల నా దగ్గరలేదు.

మురారి నా పుస్తకం వెనక్కిచ్చేశాడు. నేనది ఎయిర్‌బ్యాగులో పెట్టేశాను. కాలక్షేపానికని తెచ్చుకున్న మంచిపుస్తకాలు చదవడానికి లేకుండా పోయింది ఈ మురారి కారణంగా. ఇతగాడు నాకు శనిలా దాపురించా డు.

ఈలోగా మురారి " ఏం పాపా నువ్వా ఒంటరిగానే వస్తున్నావా?" అనడిగాడా అమ్మాయిని.

ఆ అమ్మాయి ఇబ్బందిగా నవ్వి తలాడించింది. మురారి ఆ అమ్మాయిని కూడా ఏడిపిస్తాడేమోనని నాకు భయంవేసింది. కానీ అంతలోనే అదే మంచిదనిపించింది. అప్పుడునేనామె తరపున మాట్లాడి అతణ్ణి దెబ్బతీయవచ్చు. అంతేకాదు. ఇంతసేపూ ఆమె అతడి వంక ఆరాధనగా చూస్తోంది. తనదాకా రాగానే ఆమెకతడంటే అసహ్యం వేస్తుంది. అప్పుడతడామెకు శత్రువౌతాడు. నాకూ అతడు శత్రువే! ఆ విధంగా మేమిద్దరం మిత్రులవుతాం.

ఆమెతో నాకు స్నేహం కలవాలంటే నేను చేయగలిగిందేమీలేదు. అతడామెతో తనంతటతానే గొడవ తెచ్చిపెట్టుకోవాలి. అయితే అతడామెనేడిపిస్తున్నపుడు నేను మాత్రం నవ్వకూడదని నిర్ణయించుకున్నాను.

అతడామె పేరడిగాడు. నాగరత్నం అని చెప్పింది. అంతసేపూ ఆమె నవ్వు మాత్రం విన్నాను. మాట్లాడుతూంటే వీణమీటినట్లుంది.

అతడడిగిన వాటికామె ముక్తసరిగా బదులిస్తోంది. మధ్యమధ్యసన్నగా నవ్వుతూ ఆ నవ్వులో ఆరాధనా భావాన్ని వ్యక్తపరుస్తోంది.

నేనాశించినట్లు అతడామెను ఏడిపించడంలేదు. ఒంటరిగా ప్రయాణం చేస్తున్నందుకు మెచ్చుకొని ఈరోజుల్లో మగాళ్ళకంటే ఆడాళ్ళే నయమన్నాడు. ఆ విధంగా కూడా మళ్ళీ నన్నే చిన్నబుచ్చడానికి చూస్తున్నాడు.

ఇలాంటి పరిస్థితుల్లో నా అదృష్టం కొద్దీ అక్కడకు టిటియి వచ్చాడు. టికెట్స్ అడిగిచూస్తూ మురారి వద్దకూడా టికెట్ తీసుకున్నాక "మీకు రిజర్వేషన్‌లేదే" అన్నాడు.

"కాళీలు చాలా ఉన్నాయి. ఎక్కికూర్చోమని కండక్టరు చెప్పాడు ", అన్నాడతడు హుందాగానూ, ఏమాత్రంమూ భయపడకుండానూ.

"కాళీల్లేవు " అన్నాడు టిటియి.

"చూడండిసార్ ఉంటాయి" అన్నాడతడు.

"మీకే కండక్టరు చెప్పాడో అతణ్ణే చూడమనండి. ఈ బోగీలో కాళీల్లేవు..." అన్నాడు టిటియి.

"ఏ బోగీలో యిచ్చినా బాధలేదుసార్ నాకు " అన్నాడు మురారి.

టిటియి అతడి వంక చురుగ్గా చూశాడు. అతడూ టిటియి వంక అదోలా చూశాడు. ఇద్దరి కళ్ళూ ఏవో మాట్లాడుకుంటున్నట్లు నాకర్థమయింది.

"సరే మీరిక్కడే కూర్చోండి. నేను మళ్ళీ వస్తాను. బహుశా వచ్చే స్టేషన్లో మీరీ బోగీనుంచి దిగిపోవాల్సి ఉంటుంది " అన్నాడు టిటియి.

"మీరెలాగంటే అలాగే సార్!" అన్నాడతడు.

టిటియి వెళ్ళిపోయాడు.

"రిజర్వేషన్ లేకుండా ట్రెయినెక్కారా?" అన్నాను.

"రిజర్వేషన్ చేయించుకోవాలంటే గంటలకొద్దీ టైం క్యూలోవృధాఅవుతుంది. ఏ శ్రమా లేకుండా బోగీలో తీసుకోవడంలోనే సుఖముంటుంది " అన్నాడు మురారి.

"కాళీలేదని వచ్చే స్టేషన్లో దింపేస్తే...?" అన్నాను.

"అలా అందర్నీ దింపరు. చదువుకుందుకు చేతిలో చందమామ ఉన్నవాళ్ళనే అలా దింపుతారు..." అన్నాడు మురారి.

ఆ అమ్మాయి కిసుక్కున నవ్వింది. అతడు మళ్ళీ నన్ను దెబ్బతీశాడు. టిటియి అతడిని ట్రెయిన్లోంచి దింపేస్తే చూస్తూ కసిగా నవ్వుకోవాలనిపించింది నాకు.

మరినేను మాట్లాడలేదు.

కాసేపటికి టిటియి వచ్చి "మీకు బెర్తుంది. కానీ స్థలం మారాలి..." అన్నాడు.

మురారి నావంక గర్వంగా చూశాడు. అతడక్కణ్ణించి వెళ్ళిపోతూ "ఇక నువ్వు హాయిగా చందమామలు చదువుకోవచ్చు " అన్నాడు. ఆ అమ్మాయితో కూడా "చాలా థాంక్స్ పాపా! మంచి కంపెనీ యిచ్చావు " అన్నాడు.

ఆమె యిబ్బంది గానూ, ఆరాధనా పూర్వకంగానూ నవ్వింది.

మురారి ఆఖరుసారిగా "విశాఖపట్నంలో మీ పిన్నిరాకపోతే భయపడకు. నేను జాగ్రత్తగా తీసుకుని వెడతాను. మీ పిన్ని అడ్రసు పారేసుకోకు. జాగ్రత్త!" అని నన్ను హెచ్చరించి వెళ్ళిపోయాడు.



## వంట

"నేను సడన్‌గా చచ్చిపోతాననుకో... నువ్వేం చేస్తావ్?" అడిగాడు రాజారావ్ భార్యని.

"వెరీ సింపుల్! మంచి వంటమనిషిని కుదుర్చుకుంటాను!" చెప్పింది భార్య.

కొమ్మినేని (గుంటూరు)

అప్పుడు నాగరత్నం కిలకిలా నవ్వింది. ఆ నవ్వెంతబాగుందంటే మా పక్కనే వుండి అంతవరకూ మమ్మల్ని పట్టించుకోని ఇతర ప్రయాణీకులు కూడా ముగ్ధులై ఆమె వంక చూశారు. ఆ నవ్వు నాగురించే కావడంవల్ల నేనంత ఎంజాయ్ చేయలేకపోయాను.

మురారి వెళ్ళిపోయాడు.

ఇప్పుడు ఎదురెదురు విండో సీట్లలో నేను... ఆమె...

నాకామెతో కబుర్లు చెప్పాలనుంది. మురారి నన్నామె ముందు బాగా చిన్నబుచ్చాడు. అవన్నీ సరికాదని ఆమె గ్రహించేలా చేయాలనుంది. కానీ నాలో చొరవ తక్కువ. మగపిల్లలతోనే నేనెక్కువగా మాట్లాడను కొత్తవారైనప్పుడు! అందులోనూ ఈమె ఆడపిల్ల!

పోనీ కాలక్షేపం కోసం చందమామ తీస్తే!... అప్పుడు నాగరత్నం నా గురిం చేమనుకుంటుందీ?

నాకు బొత్తిగాతోచడంలేదు. నాగరత్నం వద్ద పోయిన నా పరువెలా నిలబెట్టుకోవాలీ అని మనసాలోచిస్తోంది. ఆలోచనలను వేరే దారి మళ్ళించేందుకు చందమామలు చదువుకుందుకు లేదు. మురారి శాపం పెట్టాడు.

నా అదృష్టమో ఏమో కాసేపటికి నాగరత్నమే నన్ను పలకిరించి "విశాఖపట్నంలో మీపిన్ని గారిల్లెక్కడ?" అనడిగింది.

ఆమె నన్ను వెటకారం చేసినట్లే భావించినా నేను పిన్ని అడ్రసు చెప్పాను.

"అరే అయితే ఆ పక్కవీధిలోనే మాయిల్లు..." అందామె.

ఆ విధంగా ఇద్దరం కబుర్లలో పడ్డాం.

నాకు చాలా ఉత్సాహంగా ఉంది. ఆమె ఏదో చెబుతూ "మా నాన్నెప్పుడూ మనసత్యం వాగుడుకాయ అంటూంటారు " అంది.

"సత్యం ఎవరు?" అన్నాను ఆశ్చర్యంగా.

"నేనే నాపేరు సత్యవతి..." అందామె.

"మరి... ఇందాకా నాగరత్నం అని చెప్పినట్లున్నారు..." అన్నాను.

"అదా..." అని ఆమె స్వరం తగ్గించి "వాడో పెద్ద రౌడీలాగున్నాడు. మా నాన్నచెప్పారు. ఆడపిల్లలు



రౌడీలకెప్పుడూ అసలుపేరు చెప్పకూడదులే..." అంది.

"అతడు రౌడీ అని ఎందుకు అనుకున్నారు? నాకలా అనిపించలేదే?" అన్నాను. నేనలా అడగడానికి కారణముంది. ఆమె మురారిని రౌడీ అనుకోవడం నాకిష్టమే! ఆమె చేత అతడినింకా తిట్టించాలని నా ఆశయం.

"వాడి మాటలు, చేష్టలు... అన్నీ రౌడీవే! మా నాన్న చెప్పారు రౌడీలతో ఆడపిల్లలు గొడవ పెట్టుకోకూడదని. అందుకే ఇందాకా వాడుమీమీద జోక్సు వేస్తూంటే నాకసలేమీ నవ్వురాకపోయినా వాళ్లేమంటి వేసుకుందామని ఉత్తుత్తినే నవ్వాను" అందామె.

సంతోషంతో నా ఛాతీ ఉబ్బింది. ఉత్సాహంగా "మరి నేను రౌడీలా కనిపించడంలేదా?" అన్నాను.

"మీరు బీయస్సీ ఫస్టు క్లాసులో ప్యాసయ్యారు. ఎమ్మెస్సీ చదవ బోతున్నారు. మీరు రౌడీ ఎందుకవుతారు?" అందామె.

"ఏమోనేనన్నీ అబద్ధాలు చెప్పానేమో!" అన్నాను. ఆమె చేత ఇంకా పొగిడించుకోవాలనుంది నాకు.

"మా నాన్న చెప్పారు చేతిలో చందమామున్న కుర్రాళ్ళని ఆడపిల్లలు నమ్మొచ్చని..." అందామె కిసుక్కున నవ్వి.

అప్పుడు నాకామె కళ్ళలో చిలిపితనం కనిపించింది. మురారిలాగే ఆమె కూడా నన్ను వెటకారం చేసిందనిపించింది. వెంటనే ఉత్సాహం నీళ్ళుగారిపోయింది.

"హమ్మయ్య... మొత్తంమీద మనకు వాడిపీడ వదిలింది " అందామె మళ్ళీ.

"అతడేం చేశాడూ ..." అన్నాను అనాసక్తంగా.

"మనకే సరదాలేకుండా చేశాడు..." అందామె

మళ్ళీ నా ఛాతీ ఉబ్బింది. నేను ఉత్సాహంగా ఏదో అనబోయేలోగా "ఏమండీ మీ దగ్గరున్న చందమామల బైండివ్వరూ కాసేపు చదువుకుంటాను..." అందామె.

నేను తెల్లబోయాను. నెమ్మదిగా ఎయిర్ బ్యాగులోంచి ఆ పుస్తకం తీసిచ్చాను. ఆమె వెనువెంటనే ఆత్రుతగా అందుకుని చదవడం మొదలుపెట్టింది.

నేనప్పుడు ఆమె ముఖం చూస్తున్నాను. అందులో ఇప్పుడు చిలిపితనంలేదు. పసితనపు అమాయకత్వం కనబడుతోంది. ఇప్పుడామె ఇంకా అందంగా ఉంది. నేనామెవంకనే అలా చూస్తూండి పోయాను. మధ్యలో ఆమె తలెత్తి చూసి నన్ను గమనించింది "అయ్యో! కాలక్షేపానికని మీరు తెచ్చుకున్న పుస్తకం నేను తీసుకున్నట్లున్నాను" అంది బాధగా.

"ఫరవాలేదు లెండి నా దగ్గరింకో బైండుంది" అంటూ ఎయిర్ బ్యాగ్ లోంచి రెండో బైండ్ తీసి చదవడం మొదలెట్టాను. సగం చదువుతూ తలెత్తి చూసేసరికి ఆమె నా వంక చూస్తోంది. బహుశా నా ముఖంలోని అమాయకత్వం ఆమె నాకర్షించిందేమో!

అప్పుడామె యువతి కాదు. నేను యువకుణ్ణికాదు. ఇద్దరిదీ బాల్యావస్థ. ఇద్దరిమధ్యా ప్రణయానికి బదులు మంచిస్నేహం... ఇద్దరి చేతుల్లో చందమామలు...

ట్రయిన్లో ఆ నా ప్రయాణాన్ని ఏనాటికీ మరువలేను నేను...

*

## PARTICULARS OF OWNERSHIP IN RESPECT OF ANDHRA BHOOMI SACHITRA VARA PATRIKA

## FORM IV

| | | |
|---|---|---|
| 1. | Place of Publication | : Secunderabad |
| 2. | Periodicity of its publication | : Weekly |
| 3. | Printer's | |
| | a) Name | T. Venkatram Reddy |
| | b) Whether Citizen of India | Yes |
| | c) Address | 8-2-703/A-63, Road No.12, Banjara Hills, Hyderabad. |
| 4. | Publisher's | |
| | a) Name | T. Venkatram Reddy |
| | b) Whether Citizen of India | Yes |
| | c) Address | 8-2-703/A-63, Road No.12, Banjara Hills, Hyderabad. |
| 5. | Editor's | |
| | a) Name | C. Kanakambara Raju |
| | b) Whether Citizen of India | Yes |
| | c) Address | 'SATYA' Plot No.57, New Journalists' Colony, Jubilee Hills, Hyderabad-34. |
| 6. | Names and addresses of individuals who own the newspaper and partners or share holders holding more than one per cent of the total capital. | 1. T. Chandrasekhar Reddy, 6-3-898, Somajiguda, Hyderabad.<br>2. T. Venkatram Reddy, 8-2-703/A-63, Road No.12, Banjara Hills, Hyderabad.<br>3. T. Vinayak Ravi Reddy, 6-3-898, Somajiguda, Hyderabad. |

I, T. Venkatram Reddy hereby declare that the particulars given above are true to the best of my knowledge and belief.

Sd/-

Date: 1-3-86 Signature of Publisher.

సకుటుంబంగా
చదువుకోడానికి
చక్కని కాలక్షేపానికి
ఆంధ్రభూమి
సచిత్ర మాస పత్రిక